
నమస్తే తెలంగాణ
# జిందగీ
10
హైదరాబాద్ | ఆదివారం 19 మే 2024 www.ntnews.com



## ఎలాంటి భర్త కావాలంటే..

**అతిలోక** సుందరి శ్రీదేవి కూతురుగా బాలీవుడ్‌లో అడుగుపెట్టిన జాన్వీకపూర్ వరుస సినిమాలతో బిజీగా ఉంటున్నది. జూనియర్ ఎన్టీఆర్ హీరోగా తెరకెక్కుతున్న 'దేవర'లో హీరోయిన్‌గా టాలీవుడ్‌లోకి అరంగేట్రం చేస్తున్నది. ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన జాన్వీ ఫస్ట్ లుక్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. అంతేకాదు.. హీరో రామ్‌చరణ్, ఉప్పెన దర్శకుడు బుచ్చిబాబు సాన దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమాల్లో కూడా హీరోయిన్‌గా ఎంపికయిందీ అభినవ అతిలోక సుందరి. ప్రస్తుతం 'మిస్టర్ అండ్ మిసెస్ మహీ' సినిమాతో ప్రేక్షకులను పలకరించడానికి రెడీ అయింది. ఈ సినిమా ప్రమోషన్లలో కాబోయే భర్త ఎలా ఉండాలనే ప్రశ్న ఎదురైంది జాన్వీకి. దానికి ఈ ముద్దుగుమ్మ ఏం చెప్పిందో తెలుసా..? నా కలలను కూడా తన కలలుగా భావించేవాడు భర్తగా కావాలంటూ మనసులో మాటను బయటపెట్టింది జాన్వీ. 'నాకు ఎప్పుడూ అండగా ఉండాలి. నేను సంతోషంగా ఉండేలా చూసుకోవాలి. నవ్విస్తూ ఉండాలి. నేను ఏడుస్తుంటే పక్కనే ఉండి ధైర్యం చెప్పాలి' అని కాబోయే వాడి గురించి చెప్పుకొచ్చిందీ భామ. తన స్నేహితుడు శిఖర్ పహాడియాతో ఈ బ్యూటీ డేటింగ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. వీరిద్దరూ తిరుమల శ్రీవారిని జంటగా పలుమార్లు దర్శించుకున్నారు. అంతేకాదు, తిరుమలలోనే పెండ్లి చేసుకుంటామని జాన్వీ ఇప్పటికే వెల్లడించింది కూడా.



## బొమ్మల బాహుబలి

### క్రౌన్ ఆఫ్ బ్లడ్

**ఓటీటీ హిట్**

**డిస్నీ హాట్‌స్టార్:** మే 17
**దర్శకులు:** జీవన్ జె కాంగ్, నవీన్ జాన్



**తెలుగు** సినిమాకు జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చిన సినిమా బాహుబలి. ఇండియన్ సినిమాలకు టాలీవుడ్ స్టామినాను రుచి చూపించిన ఈ సినిమా ఇప్పుడు వెబ్ సిరీస్ రూపంలో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే ఈసారి యానిమేటెడ్ వెర్షన్‌లో ప్రేక్షకులను మెప్పించడానికి రెడీ అయ్యింది. బాహుబలి సినిమాకు దర్శకత్వం వహించిన దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి.. ఈ యానిమేటెడ్ వెర్షన్‌కు ఒకానొక నిర్మాతగా వ్యవహరించారు. డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో పలు భాషల్లో అందుబాటులోకి వచ్చిందీ మూవీ.

**కథ:** మాహిష్మతి సామ్రాజ్యం చుట్టుపక్కల ఉన్న రాజ్యాలను ఆక్రమిస్తూపోతున్నాడు రక్తదేవ్ అనే క్రూరుడైన రాజు. అలా మాహిష్మతి సామ్రాజ్యాన్ని కూడా ఆక్రమించుకోవాలని భావిస్తాడు. ఆ రక్తదేవ్‌ను బాహుబలి, భల్లాలదేవ కలిసి ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అయితే, ఈ కథలో బాహుబలికి భిన్నంగా మాహిష్మతిని సొంతం చేసుకోవాలని భావించే రక్తదేవ్‌కు విధేయుడిగా పనిచేస్తాడు కట్టప్ప. అది ఈ కథలోని ఆసక్తికర అంశం. అసలు రక్తదేవ్ ఎవరు? ఈ కథలో ఆయన పాత్ర ఏంటి? రక్తదేవ్ పక్కన కట్టప్ప ఎందుకు ఉన్నాడు? బాహుబలి, భల్లాలదేవ కలిసి తమ సామ్రాజ్యాన్ని కాపాడుకున్నారా? అనే విషయాలు తెలియాలంటే మాత్రం ఈ సిరీస్ చూడాల్సిందే.

**ఎలా ఉందంటే..**

బాహుబలిని కట్టప్ప ఎందుకు చంపాడు అనే ప్రశ్న ప్రేక్షకుల్లో ఎంత ఆసక్తిని రేకెత్తించిందో.. ఈ యానిమేటెడ్ సిరీస్‌లో కూడా కట్టప్ప క్యారెక్టర్ అంత ఇంపాక్ట్‌ను క్రియేట్ చేస్తుంది. బాహుబలి, రక్తదేవ్ మధ్య వచ్చే కొన్ని సన్నివేశాలు సిరీస్‌పై ఆసక్తిని పెంచుతాయి. ఇక, బాహుబలి పేరు వినగానే గుర్తొచ్చేది పాన్ ఇండియా స్టార్ ప్రభాస్. ఈ యానిమేటెడ్ సిరీస్‌లో బాహుబలి లుక్స్ పర్వాలేదనిపిస్తాయి అంతే. డబ్బింగ్ కూడా అంతగా ఆకట్టుకోదు. అయితే, బాహుబలి సినిమాకు ఉన్న క్రేజ్‌తో ఈ సిరీస్ చూస్తే నిరాశ తప్పదు. దర్శకుడు జీవన్ జె కాంగ్, నవీన్ జాన్ ఎంతో కష్టపడి ఈ ఔట్‌పుట్ తీసుకొచ్చారని చెప్పాలి. బాహుబలి యానిమేటెడ్ వెర్షన్ భారీ అంచనాలతో ఓటీటీలో విడుదలైన 'బాహుబలి: క్రౌన్ ఆఫ్ బ్లడ్ బాగానే ఉంది. అంచనాలు పెట్టుకోకుండా చూస్తే ఈ వేసవిలో పిల్లలు, పెద్దలు ఎంజాయ్ చేయొచ్చు.

## అదే చివరి మాట

**1994లో** ఇండస్ట్రీలో అడుగుపెట్టి.. తనదైన నటనతో ఎన్నో నేషనల్ అవార్డులు, ఫిల్మ్‌ఫేర్ అవార్డులను గెలుచుకున్నారు మనోజ్ బాజ్‌పాయ్. హిందీతోపాటు తెలుగు, తమిళ భాషల్లో సినిమాలు చేసిన మనోజ్.. ఇటీవల మీడియాతో మాట్లాడుతూ తన జీవితంలో జరిగిన అత్యంత విషాద సంఘటనను పంచుకున్నారు. ''ఆ రోజు నేను 'కిల్లర్ సూప్' వెబ్‌సిరీస్ సెట్స్‌లో ఉన్నాను. నా సోదరి ఫోన్ చేసి నాన్న జీవితం పూర్తయినట్టేనని చెప్పింది. డాక్టర్లు మాత్రం నాన్న ఇంకా ఈ ప్రపంచంలో ఉన్నారని చెప్పారు. నాన్నకూ, నాకు మధ్య మంచి అనుబంధం ఉండేది. అందుకే నాన్నకు ఫోన్ చేసి 'నాన్నా.. నొప్పి భరించింది చాలు.. అందరినీ వదిలేసి వెళ్లిపోయే సమయం వచ్చేసింది.. ప్లీజ్ వెళ్లిపో..' అని చెప్పా. నేనలా మాట్లాడిన తర్వాతి రోజు తెల్లవారుజామునే నాన్న మరణించారు. నాన్నతో నేను ఆ మాటలు చెప్పినప్పుడు వ్యాన్‌లో బాయ్ ఉన్నాడు. నా మాటలు విన్న బాయ్ విపరీతంగా ఏడ్చేశాడు. ఆ రోజులు చాలా కష్టంగా గడిచాయి. నా గొంతు విన్న తర్వాత మనసు తేలికపడటంతో నాన్న ఆనందంగా తుదిశ్వాస విడిచారు. ఆయన మరణించారనే వార్త విన్న తర్వాత నాకు కన్నీళ్లు ఆగలేదు. అదే నా జీవితంలో అత్యంత విషాద సంఘటన'' అని చెప్పుకొచ్చారు మనోజ్ బాజ్‌పాయ్.



## అంత తేడా ఎందుకో..

**మహేశ్‌బాబు** నటించిన 'వన్: నేనొక్కడినే' సినిమాతో ఇండస్ట్రీకి పరిచయమైంది కృతిసనన్. అనంతరం బాలీవుడ్‌లో సినిమాలు చేస్తూ స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. ఈ ఏడాది ప్రారంభంలో బాలీవుడ్ స్టార్ హీరో షాహిద్ కపూర్‌తో కలిసి 'తేరీ బాతో మే ఐసా ఉల్జా జియా' సినిమాలో నటించింది. అనంతరం టబు, కరీనా కపూర్‌తో కలిసి 'క్రూ' చిత్రం చేసింది. ఈ రెండు సినిమాలూ బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను రాబట్టాయి. ఈక్రమంలోనే ఈ అమ్మడు 'పే పారిటీ'పై తన అభిప్రాయాల్ని పంచుకున్నది. ఇండస్ట్రీలో నటీనటుల రెమ్యునరేషన్లలో తేడాలు (పే పారిటీ) ఎందుకు ఉంటాయో ఇప్పటికీ అర్థం కాదు. 10 సంవత్సరాలుగా ఒక్క హిట్ కూడా ఇవ్వని నటుడికి 10 రెట్లు ఎక్కువ రెమ్యునరేషన్ చెల్లిస్తారు. హీరోయిన్ల విషయంలో అది భిన్నంగా ఉంటుంది. నటీనటుల రెమ్యునరేషన్లలో వ్యత్యాసం అనేది సరైనదే అనే ఉద్దేశంలో నిర్మాతలు ఉన్నారు. డిజిటల్, శాటిలైట్ రైట్స్ ద్వారా సినిమా బడ్జెట్ చాలావరకు రికవర్ అవుతున్నది. సినిమా విడుదలకు ముందే నిర్మాతలు సేఫ్ జోన్‌లోకి వచ్చేస్తున్నారు. హీరోయిన్ ఓరియెంటెడ్ సినిమాలతో పోలిస్తే హీరో ప్రధానంగా తెరకెక్కిన సినిమాలు మెరుగైన ఓపెనింగ్స్ రాబడతాయి. రెమ్యునరేషన్లలో తేడాలు అనేవి ఇక్కడి నుంచే మొదలవుతాయని అనుకుంటున్నాను' అని చెప్పుకొచ్చింది కృతిసనన్.







అదే రామాయణం..
అదే మహాభారతం..

**వెండితెరపై ఎన్నిసార్లు వచ్చినా కండ్లారా చూడటం తెలుగు ప్రేక్షకుడి రివాజు. భారతంలోని పర్వాలను సినిమాలుగా నేత్రపర్వంగా తీర్చిదిద్దిన ప్రతిసారీ వన్స్‌మోర్ కొట్టడం మనకు అలవాటు. రామాయణ, భారతాలే కాదు.. సాంఘిక, పౌరాణిక, చారిత్రక, ప్రేమ కథలెన్నో వెండితెరపై మళ్లీమళ్లీ వచ్చి.. మాతృకలను మించిన విజయాలు అందుకున్నాయి. ఈ ప్రయత్నంలో బొక్కబోర్లా పడ్డ సినిమాలూ ఉన్నాయి. జయాపజయాల సంగతి అటుంచితే.. పునర్నిర్మాణానికి నోచుకొని.. ప్రేక్షకుల మనసు దోచుకున్న సినిమాల సంగతులు ఇవి..**

# పాత కథ! ఫలితం.. మారె కదా!!



**తెలుగు** టాకీ మొదలైంది 'భక్తప్రహ్లాద' (1932) సినిమాతో. హెచ్.ఎం.రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రం శ్రీమద్భాగవతంలోని నరసింహ అవతార నేపథ్యంలో జరిగే కథ. ఆ కథనే 1967లో అదే పేరుతో ఏవీఎం ప్రొడక్షన్‌వారు పునర్నిర్మించారు. దీనికి దర్శకుడు చిత్రపు నారాయణమూర్తి. ఎస్వీ రంగారావు, అంజలీదేవి, హరనాథ్ తదితరులు నటించిన ఈ సినిమా మంచి విజయాన్ని సాధించింది. ఎస్.రాజేశ్వరరావు స్వరపరిచిన ఇందులోని పాటలు నేటికీ కర్ణపేయమే. ఈ సినిమా కంటే ముందే 1958లో దర్శకుడు బీఏ సుబ్బారావు 'చెంచులక్ష్మి' సినిమా చేశారు. ఈ సినిమా కథ కూడా సగం అదే. మిగతా కథ నృసింహావతారానికి కొనసాగింపుగా ఉంటుంది.

**మహాభారతంలోని** పాత్రలతో అల్లిన కల్పిత కథ 'శశిరేఖాపరిణయం'. అప్పటివరకూ రంగస్థలంపై నాటకంగా ఉన్న ఈ కథను 1936లో 'మాయాబజార్' పేరుతో తెరకెక్కించారు. అదే కథ 1957లో అదే పేరుతో మరోసారి ప్రేక్షకులను పలకరించింది. ఈ అద్వితీయ కళాఖండానికి దర్శకుడు కె.వి.రెడ్డి. తెలుగు సినిమా చరిత్రలో 'మాయాబజార్'ది సువర్ణాధ్యాయం. ఈ సినిమా గురించి ప్రపంచ దేశాలు మాట్లాడుకున్నాయి. నేటికీ ఫిల్మ్ టెక్నాలజీ స్టూడెంట్స్‌కి 'మాయాబజార్' ఓ పాఠ్యాంశం. ఎన్టీఆర్, ఏఎన్నార్, ఎస్వీఆర్, సావిత్రి, రుష్యేంద్రమణి, సూర్యకాంతం, గుమ్మడి, సీఎస్ఆర్ ఇలా తెలుగు సినిమాను వెలిగించిన మహనీయ నటులందరూ నటించిన ఈ చిత్రం తెలుగు సినిమా ప్రైడ్.

**దర్శకుడు** పి.పుల్లయ్య 1937లో తెరకెక్కించిన హిస్టారికల్ డ్రామా 'సారంగధర'. బందా కనకలింగేశ్వరరావు టైటిల్‌రోల్ చేశారు. ఇదే కథ 1957లో మళ్లీ తెరకెక్కింది. వీయస్ రాఘవన్ దర్శకుడు. ఇందులో టైటిల్‌రోల్ ఎన్టీయార్ చేశారు. ఇంకా ఎస్వీఆర్, భానుమతి రామకృష్ణ, రాజసులోచన వంటి ఉద్దండులు నటించిన ఈ సినిమా ఆశించినంత విజయాన్ని అందుకోలేకపోయింది.

**పి.పుల్లయ్య** పేరు చెప్పగానే అందరికీ గుర్తొచ్చే సినిమా 'శ్రీ వేంకటేశ్వర మహత్మ్యం'. 1960లో విడుదలైన ఈ సినిమా చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. ఈ సినిమా విడుదలైన థియేటర్లన్నీ దేవాలయాలయ్యాయి. ఎన్టీఆర్ ఇమేజ్‌ను సమూలంగా మార్చేసిన సినిమా ఇది. తిరుమల శ్రీవారి దర్శనానంతరం భక్తజనం మద్రాస్ వెళ్లి ఎన్టీఆర్‌ని దర్శించుకునే సంప్రదాయానికి తెరలేపిన సినిమా కూడా ఇదే! విశేషమేంటంటే.. ఇదే పి.పుల్లయ్య ఇదే కథతో ఈ సినిమా కంటే ముందు.. అంటే 1939లో 'బాలాజీ' అనే సినిమా తీశారు. అందులో వేంకటేశ్వర స్వామిగా చిలకలపూడి సీతారామాంజనేయులు (సీఎస్ఆర్) నటించారు. ఆ సినిమా కూడా పెద్ద హిట్. అయితే.. 'శ్రీ వేంకటేశ్వర మహత్మ్యం' మాత్రం తెలుగు సినిమా టాప్ 10 క్లాసిక్స్‌లో ఒకటిగా నిలిచిపోయింది.

**పుల్లయ్య** దర్శకత్వంలో 1942లో రూపొందిన చందమామ కథ 'బాలనాగమ్మ'. రామాయణాన్ని ప్రేరణగా తీసుకొని రాసుకున్న కథ ఇది. ఇందులో టైటిల్ రోల్‌ను కాంచనమాల పోషించారు. మహానటుడు గోవిందరాజుల సుబ్బారావు మాయలఫకీర్‌గా నటించారు. ఈ సినిమా అప్పట్లో హిస్టారికల్ హిట్. ఇదే కథ మళ్లీ 1959లో పునర్నిర్మితమైంది. ఇందులో బాలనాగమ్మగా అంజలీదేవి నటించగా, కార్యవర్ధి పాత్రను ఎన్టీఆర్ పోషించారు. ఇక మాయలఫకీర్‌గా ఎస్వీఆర్ విశ్వరూపం చూపించేశారు. ఈ సినిమా కూడా పెద్ద హిట్.

**చిత్తూరు** నాగయ్య స్వీయ దర్శకత్వంలో నటించి, నిర్మించిన భక్తిరస సంగీతకావ్యం 'త్యాగయ్య' 1946లో విడుదలైన ఈ సినిమా వాణిజ్యపరంగా తెలుగు సినిమా స్థాయిని పెంచింది. త్యాగయ్యగా ఆచంద్రతారార్కం నిలిచిపోయేంత అద్భుతమైన అభినయాన్ని కనబరిచారు నాగయ్య. ఇదే కథను జేవీ సోమయాజులుతో అదే టైటిల్‌తో తెరకెక్కించారు దర్శకుడు బాపు. 1981లో విడుదలైన ఈ సినిమా పెద్దగా ఆడలేదు. అలాగే కె.వి.రెడ్డి దర్శకత్వంలో నాగయ్య నటించిన 'యోగి వేమన' (1947) చిత్రం కూడా పెద్ద విజయం సాధించింది. అదే కథతో 'వేమన చరిత్ర' అని విజయ్‌చందర్ ఓ సినిమా చేశారు. 1986లో విడుదలైన ఆ సినిమా పరాజయాన్ని మూటగట్టుకుంది.

**కొంతభాగం** గూడవల్లి రామబ్రహ్మం, మరి కొంత భాగం ఎల్వీప్రసాద్ దర్శకత్వం వహించిన పలనాటి వీరగాథ 'పల్నాటియుద్ధం' (1947). గోవిందరాజుల సుబ్బారావు బ్రహ్మనాయుడిగా, కన్నాంబ నాయకురాలు నాగమ్మగా, అక్కినేని బాలచంద్రుడిగా నటించిన ఈ చిత్రం అప్పట్లో అద్భుత విజయాన్ని అందుకుంది. అదే చరిత్రను అదే పేరుతో 1966లో మళ్లీ తీశారు. రామినేని దర్శకుడు. ఇందులో బ్రహ్మనాయుడుగా ఎన్టీ రామారావు నటించగా, నాయకురాలు నాగమ్మ పాత్రను భానుమతి పోషించారు. హరనాథ్ బాలచంద్రుడు. జమున, బాలయ్య, వాసంతి, రాజనాల ఇతర పాత్రధారులు. మాతృక అంత కాకపోయినా ఈ సినిమా కూడా మంచి విజయాన్నే అందుకుంది.

**ఇక** ప్రేమకథల్లో మకుటాయమానం అక్కినేని 'దేవదాసు' (1953). శరత్‌చంద్ర నవల ఆధారంగా వేదాంతం రాఘవయ్య తెరకెక్కించిన ఈ కన్నీటి ప్రేమకావ్యానికి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. ఇదే నవల ఆధారంగా ఇతర భాషల్లో కూడా సినిమాలు తెరకెక్కినా, అక్కినేని 'దేవదాసు' దరిదాపుల్లోకి కూడా ఏ సినిమా రాలేకపోయింది. ''దేవదాసు' అంటే అక్కినేని మాత్రమే'.. అని దిలీప్‌కుమార్ లాంటి మహానటుడే కొనియాడాడంటే.. అందులో అక్కినేని అభినయ తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఆ కథనే మళ్లీ తీసి, ఆ పాత్రను తనే చేసి.. పెద్ద సాహసమే చేశారు సూపర్‌స్టార్ కృష్ణ. విజయనిర్మల దర్శకత్వం వహించిన ఈ 'దేవదాసు' 1974లో విడుదలై ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది.

**కన్నడ** కంఠీరవ రాజ్‌కుమార్ నటించిన తొలి సినిమా 'కాళహస్తి మహత్మ్యం'. తెలుగు, కన్నడ భాషల్లో ఒకేసారి తెరకెక్కి, 1954లో విడుదలైన ఈ సినిమా రెండు భాషల్లోనూ మంచి విజయాన్ని అందుకుంది. హెచ్.ఎల్.ఎన్.సింహా దర్శకుడు. ఇదే కథతో బాపు దర్శకత్వంలో 'భక్తకన్నప్ప' చిత్రాన్ని నిర్మించారు రెబల్‌స్టార్ కృష్ణంరాజు. అందులో కన్నప్పగా టైటిల్ రోల్ ఆయనే పోషించారు. ఈ సినిమా మంచి విజయాన్ని సాధించింది. తాజాగా ఈ కథ మళ్లీ తెరకెక్కుతుండటం విశేషం. మంచు విష్ణు కథానాయకుడిగా మోహన్‌బాబు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సినిమా పేరు 'కన్నప్ప'. ముఖేశ్ కుమార్‌సింగ్ దర్శకుడు.

> ఎన్టీఆర్ 'లవకుశ' (1963) సినిమా గురించి తెలియని వారుండరు. వాణిజ్యపరంగా తెలుగు సినిమా 'కోటి' అనే అంకెను చూసింది 'లవకుశ'తోనే. 47 ఏండ్ల తర్వాత అదే కథతో సినిమా చేశారు దర్శకుడు బాపు. ఆ సినిమానే 'శ్రీరామరాజ్యం'. ఇందులో రాముడిగా బాలకృష్ణ నటిస్తే, సీతగా నయనతార కనిపించారు. 'లవకుశ' అంత కాకపోయినా 'శ్రీరామరాజ్యం' కూడా బాగానే ఆడింది.

**వేదాంతం** రాఘవయ్య దర్శకత్వంలో తెరకెక్కిన మరో అజరామర ప్రేమకావ్యం 'అనార్కలి' (1955). అంజలీ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రానికి అప్పటి జనం నీరాజనాలు పట్టారు. అనార్కలిగా అంజలీదేవి, సలీంగా అక్కినేని, అక్బర్‌గా ఎస్వీ రంగారావు అనితర సాధ్యమైన అభినయాన్ని కనపరిచారు. ముఖ్యంగా ఆదినారాయణరావు స్వరాలు ఈ సినిమా విజయంలో ప్రధాన పాత్ర పోషించాయి. ఇదే కథను తీసుకొని 1979లో 'అక్బర్ సలీం అనార్కలి' తీశారు ఎన్టీఆర్. అందులో అక్బర్‌గా ఎన్టీఆర్, సలీంగా బాలకృష్ణ, అనార్కలిగా దీప నటించారు. సినిమా ఘోర పరాజయం పాలైంది.

**1960లో** ఎస్వీ రంగారావు హీరోగా 'హరిశ్చంద్ర' సినిమాను నిర్మించారు లక్ష్మీరాజ్యం. ఇందులో చంద్రమతిగా ఆమే నటించారు. ఈ సినిమా అద్భుత విజయాన్ని అందుకుంది. అదే కథతో విజయా సంస్థ కె.వి. రెడ్డి దర్శకత్వంలో 'సత్యహరిశ్చంద్ర' (1965) చిత్రాన్ని నిర్మించింది. హరిశ్చంద్రుడిగా ఎన్టీ రామారావు నటించారు. అప్పటికే మాస్ హీరో ఇమేజ్ ఉన్న ఎన్టీఆర్‌ను ఇలా సాత్వికమైన పాత్రలో జనం చూడలేకపోయారు. దాంతో ఆశించిన స్థాయిలో ఆడలేదు.

**ఎన్టీఆర్** భక్త పుండరీకుడిగా, భోగలాలసుడిగా అద్భుతంగా నటించి, నిర్మించిన భక్తిరస చిత్రరాజం 'పాండురంగ మహత్మ్యం' (1957). కమలాకర కామేశ్వరరావు దర్శకత్వం వహించిన ఈ చిత్రం అఖండ విజయం సాధించింది. ఈ చిత్రంలో టీవీ రాజు స్వరపరిచిన పాటలు నేటికీ శ్రోతల్ని అలరిస్తూనే ఉన్నాయి. ఈ కథ మళ్లీ 51 ఏండ్ల తర్వాత కె.రాఘవేంద్రరావు దర్శకత్వంలో 'పాండురంగడు'గా పునర్నిర్మితమైంది. ఇందులో పుండరీకుడిగా, పాండురంగడిగా బాలకృష్ణ ద్విపాత్రాభినయం చేశారు. సినిమా సరిగ్గా ఆడలేదు.

**ఎన్టీఆర్** బృహన్నలగా, ఎస్వీఆర్ కీచకుడిగా, సావిత్రి ద్రౌపదిగా జీవించిన 'నర్తనశాల' (1963) తెలుగు సినిమా టాప్ 10 క్లాసిక్స్‌లో ఒకటి. కమలాకర కామేశ్వరరావు ఈ చిత్ర దర్శకుడు. ఇదే కథను 'శ్రీమద్విరాటపర్వం' పేరుతో మళ్లీ తీసి, దారుణమైన ఫ్లాప్‌ను మూటగట్టుకున్నారు ఎన్టీఆర్.

**అలాగే** తెలుగు నేలపై జరిగిన మరో వీరగాథ 'బొబ్బిలియుద్ధం'. 1964లో సి.సీతారాం స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రంలో రంగరాయలుగా ఎన్టీఆర్, తాండ్ర పాపారాయుడుగా ఎస్వీఆర్ నట విశ్వరూపం చూపించారు. ఈ సినిమా మంచి విజయాన్నే అందుకుంది. ఇదే కథతో దర్శకుడు దాసరి 'తాండ్ర పాపారాయుడు' తెరకెక్కించారు. 1986లో విడుదలైన ఈ చిత్రం హిట్ అయింది. ఇందులో టైటిల్ రోల్‌ను కృష్ణంరాజు పోషించారు.

**ఇప్పుడు** మనం గుర్తు చేసుకుంది మచ్చుకు కొన్నే.. లోతుగా వెళ్తే ఇంకా ఎన్నో! మొత్తంగా చెప్పొచ్చేదంటంటే.. సక్సెస్ చుట్టూ సినిమా తిరుగుతుంటుంది. సక్సెస్ వెనుక పరుగెడుతుంటుంది. నిత్యం సక్సెస్ నామస్మరణతో తరించిపోతుంటుంది. జనం మెచ్చిన కథలతో సినిమాలు తీయడమే సక్సెస్ ఫార్ములా. కాకపోతే.. తీయాల్సిన వాళ్లు తీయాలి.. చేయాల్సిన వాళ్లు చేయాలి. అప్పుడే సినిమా జనరంజకం అవుతుంది.

... నరసింహ బుర్రా